క్లుప్తంగా

విద్యార్థి ఆచూకీ లభ్యం

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి నార్పలకు చెందిన సాయిమదన్ సోమవారం ఉదయం 6 గంటలకు అదృశ్యమైనట్లు విద్యార్థి తల్లి 100కు ఫోన్ చేశారు. దీంతో పోలీసులు ప్రిన్సిపాల్ గోపాల్‌ను విచారించారు. అయితే సోమవారం మధ్యాహ్నం బంధువు ఇంట్లోనే విద్యార్థి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



అగళి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి

మడకశిర(అగళి): రోగులకు డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మంజువాణి సూచించారు. సోమవారం అగళి పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించడంతో పాటు ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 'ఫ్యామిలీ ఫిజీషియన్' పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

రొద్దం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు సూచించారు. సోమవారం మండల పరిధిలోని సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీవైఈఓ రంగస్వామి

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లి గ్రామంలో డీవైఈఓ రంగస్వామి సోమవారం రాత్రి పర్యటించారు. ఇందులో భాగంగానే పదో తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ఏ విధంగా పరీక్షలకు సన్నద్ధమవుతున్నారో పరిశీలించారు. ప్రణాళికా బద్ధంగా చదవాలని సూచించారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



భార్గవిని అభినందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం టౌన్: బెంగళూరులో ఈ నెల 15 నుంచి 21 వరకూ జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని భార్గవి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని భార్గవిని బాలయేసు విద్యాసంస్థల అధినేత, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి అభినందించి సత్కరించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

పెనుకొండ: తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఇస్లాపురం గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్తీక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కమిషనర్‌తో మాట్లాడి తగిన చర్యలు చేపడతామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో సోమవారం వాసవీ యువతి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం జ్యోతిర్మయి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

పాఠశాల తనిఖీ

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి సత్యనారాయణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు , రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ప్రగతి ఏ విధంగా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

మత సామరస్యానికి ప్రతీక

తాతయ్యస్వామి దర్గా

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఉరుసు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దర్గా ట్రస్టు సభ్యులు

పరిగి: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీరంగరాజుపల్లి తాతయ్య దర్గా ఉరుసు ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అధికారులు, దర్గా వెల్ఫేర్ ట్రస్టు సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

తాతయ్య స్వామి చరిత్ర ఇలా..

కర్ణాటక రాష్ట్రం రామ్‌నగర్ జిల్లాలోని బిడిది అనే గ్రామానికి చెందిన తాతయ్య (అసలు పేరు హజరత్ సయ్యద్ షేక్ బుడేన్‌షా ఖాదరి వలీ) చిన్న నాటి నుంచే ఆధ్యాత్మిక చింతనతో మెలిగేవారు. తల్లి బావక్కయ్య, తండ్రి బిడిది బాబన్న అనే దంపతులకు జన్మించిన కుమారుల్లో రెండో సంతానంగా జన్మించారు. ఆయన వివాహం చేసుకోకుండా సన్యాసిగా జీవితాన్నంతా గడిపారు. తన పదవ యేట నుండే సొంత ఊరిని వదిలి వివిధ ప్రాంతాలలో తిరుగుతూ తన దైవాధి తత్వాలతో బోధనలు చేశారు. చివరి దశలో తన పూర్వికుల స్వగ్రామం శ్రీరంగరాజుపల్లికి చేరారు. తన ఆధ్యాత్మిక బోధనలు, తత్వాలతో భక్తులకు ఉపదేశం చేసేవారు. అంతేకాకుండా తన మహిమలతో భక్తిని చాటేవారు. తన 90వ యేట 1965లో సమాధి పొందారు. నాటి నుంచి దర్గాకు వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రతి పౌర్ణమీ, అమావాస్యల రోజున గ్రామస్తులు దర్గా వద్ద నడుమ భజనలు నిర్వహిస్తారు.



తాతయ్య స్వామి సమాధి



తాతయ్యస్వామి దర్గా

మూడు రోజుల పాటు ఉత్సవాలు

ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా దర్గా మహోత్సవాల ఉరుసు ఉత్సవాలను ఈ ఏడాది గ్రామస్తులు, దర్గా వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. మార్చి 7న మంగళవారం రాత్రి 10 గంటలకు గంధోత్సవం జరుగుతుంది. బుధవారం ఉదయం నుంచే రోజంతా అన్నదానం నిర్వహిస్తారు. రాత్రికి జిద్దా జిద్దీ ఖవాలీ కార్యక్రమం జరుగుతుంది. గురువారం రాత్రికి ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించనున్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

శ్రీరంగరాజుపల్లికి చేరుకోవడం ఇలా..

తాతయ్య గుడి దర్గాతో ప్రాముఖ్యత సంపాదించుకున్న శ్రీరంగరాజుపల్లి పరిగి మండల కేంద్రానికి 4 కి.మీ దూరంలో ఉంది. అలాగే 13 కి.మీ దూరంలో ఉన్న హిందూపురం నుంచి శ్రీరంగరాజుపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఆటోలు బాగా తిరుగుతుంటాయి.

రేషన్ బియ్యం పట్టివేత

చిలమత్తూరు: మండలంలోని మరవకొత్తపల్లి సమీపంలోనిని పొలాల్లో నిర్మించిన గోడౌన్‌లో నిల్వ ఉంచిన సుమారు 20 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం చిలమత్తూరుకు చెందిన శ్రీనివాసులువిగా పోలీసులు గుర్తించారు. అయితే ఈ వ్యవహారానికి సంబంధించి ఎవరెవరి హస్తం ఉందో పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. కొద్ది నెలలుగా బియ్యాన్ని మరవకొత్తపల్లి - వీరాపురం రహదారి గుండా కర్ణాటకకు తరలిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

9న గదుల వేలం

గుడిబండ: గుడిబండ పశువుల సంత, కూరగాయల సంత, దినసరి బస్టాండ్, పంచాయతీ షాపింగ్ గదులకు ఈనెల 9న స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కరుణాకర్‌గౌడు అధ్యక్షతన బహిరంగ వేలం వేయనున్నట్లు ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శి నాగరాజునాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. పశువుల సంతకు రూ.5,50,000, కూరగాయల సంతకు రూ.1,00,000. దినసరి బస్టాండుకు రూ. 50,000, పంచాయతీ షాపింగ్ గదులకు ఒక్కొక్కటికి రూ.20,000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ సురేష్

అమరాపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13న నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సురేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏ విధంగా ఉన్నాయి? విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో సౌకర్యాల కల్పనపై మాట్లాడారు. ఏమైనా సౌకర్యాలు లేకుంటే వెంటనే చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే పోలింగ్ రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యులు అందుబాటులో ఉండాలని సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్‌కు సూచించారు. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 1145, ఉపాధ్యాయ ఓటర్లు 50 మంది ఉన్నారని తెలిపారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



రొళ్ల: కల్యాణోత్సవం అనంతరం భక్తులకు దర్శనం ఇస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి



పావగడ: అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున నరసింహస్వామి సమేతంగా అమ్మవార్లకు అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ఉయ్యాలలో కూర్చోబెట్టారు. తర్వాత వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కల్యాణం తిలకించారు.

నేడు బ్రహ్మరథోత్సవం

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం 'బ్రహ్మ రథోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

పావగడ: స్థానిక కణివె నరసింహస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీదేవి సమేత కణివె లక్ష్మి నరసింహస్వామి (వసంత వల్లభరాయలు) కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహ గోపాల్‌తో పాటు పురోహితులు స్వామివార్ల కళ్యాణం జరిపించారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత

పరిగి: సమాజంలో స్త్రీకి ప్రత్యేక గౌరవం ఉందని, ముఖ్యంగా బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ వన్నప్ప అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బాగంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో సోమవారం భేటీ బచావో..భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాలికలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు పలు సూచనలు, సలహాలిచ్చారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి క్రాస్ సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... ఉగ్రేపల్లి గ్రామానికి చెందిన నాగరాజు మడకశిర నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా వాహనం అదుపుతప్పింది. రోడ్డుపై పడిపోయిన నాగరాజును వాహనదారులు గమనించి వెంటనే మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అధికారంలోకి వస్తే హామీల అమలు

పావగడ: జేడీఎస్ పార్టీ అధికారం లోకి వస్తే పంచరత్న పథకాలు అమలు చేసి బడుగు బలహీన వర్గాల వారిని ఆదుకుంటామని స్థానిక మాజీ ఎమ్మెల్యే, జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప తెలిపారు. పట్టణంలోని 9,10,11 వార్డులలో సోమవారం ప్రచారం నిర్వహించారు.

దొడ్డహళ్లిలో కాంగ్రెస్...

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడితే సాధారణ ప్రజలకు అన్నభాగ్య, గృహలక్ష్మి, గృహజ్యోతి తదితర సంక్షేమ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. తాలూకాలోని దొడ్డహళ్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్యారంటి కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

మడకశిర: పట్టణంలో ఇద్దరు మట్కా బీటర్లను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. వారి నుంచి రూ.21,725 నగదుతో పాటు రెండు సెల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



గోరంట్ల: బూదిలిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



అమరాపురం: ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్న ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

అమరాపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు తొలి ప్రాధాన్యతా ఓట్లు వేసి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం మండలంలోని బసవనపల్లి, కె.శివరం, పి.శివరం, హలుకూరు, అమరాపురం, వలస, వి.అగ్రహారం, హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు హలుకూరు సమీపంలో ఉన్న కేజీబీవీ, మోడల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పట్టభద్రులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రూ.కోట్లు పెట్టుబడి పెట్టేలా కంపెనీలను ప్రోత్సహిస్తుండటంతో వేలాది ఉద్యోగాల కల్పనకు బాట వేస్తున్నారన్నారు. మరోవైపు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరిష్ యాదవ్‌లు మండలంలోని వివిధ పాఠశాలలు సందర్శించి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీలు కృష్ణమూర్తి, లలితమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో...

మడకశిర: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి,రామచంద్రారెడ్డిలను గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఓటర్లను కోరారు. ఆయన సోమవారం మడకశిరలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

గుడిబండలో...

గుడిబండ: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం మండలంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. జేసీఎస్ కన్వీనర్ కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: పశ్చిమ రాయసీలమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం మండలంలోని పాలసముద్రం ,బూదిలి, వానవోలు, గౌనివారిపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, సచివాలయాలల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి ఆయన ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డితో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, గోరంట్ల మార్కెట్‌యార్డు అధ్యక్షుడు బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, బూదిలి, వానవోలు సహకార సంఘం అధ్యక్షులు రఘురామిరెడ్డి, రాజేంద్రప్రసాద్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్‌సాహెబ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా తదితరులు పాల్గొన్నారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, శ్యామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డిని మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, ఎంపీపీ కవిత, సచివాలయం కన్వీనర్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు సోమవారం ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, ప్రైవేట్ పాఠశాలల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ కోరారు. సోమవారం సాయంత్రం డీబీ కాలనీలోని చిన్మయ స్కూల్‌లో ఉపాధ్యాయుల సమావేశంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

హిందూపురం/హిందూపురంటౌన్: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరుతూ హిందూపురం పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి పాఠశాలలు, కళాశాల, సచివాలయాల్లో ఉద్యోగులను కలసి ఓట్లను అభ్యర్థించారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు లోకేష్ వాల్మీకి, ప్రణయ్‌రెడ్డి, అమర్నాథ్, మనోజ్‌గౌడ్, ఉదయ్‌కుమార్, మనోజ్, శ్యాంబాబు, చందన్, శ్రీనివాసులు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్‌జూలియట్‌లు కూడా ప్రచారం చేశారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



ఆసీఫ్‌వుల్లా

హిందూపురం: ఢిల్లీలో ఆదివారం జరిగిన ఇండియా బాడీ బిల్డింగ్ జాతీయ పోటీల్లో హిందూపురానికి చెందిన పి.ఆసీఫ్‌వుల్లా ప్రతిభ కనబరచి రెండో స్థానంలో నిలిచినట్లు గోల్డన్ జిమ్ షఫీవుల్లా తెలిపారు. ఏపీ నుంచి ఆసీఫ్ వుల్లా పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపర్చిన ఆసీఫ్‌వుల్లాకు పట్టణంలోని ప్రముఖులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

హిందూపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాదులు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక కొట్నూరు నిర్మల వృద్ధాశ్రమంలో ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సమావేశంలో న్యాయవాదులు సంతోషి కుమారి, నవీరా, రహిమాన్, ఉదయ్‌సింహారెడ్డి, రమేష్, యూసుఫ్ వృద్ధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వర జ్యోతి దర్శనానికి ప్రత్యేక బస్సులు

హిందూపురం: శైవక్షేత్ర దర్శనాలకు భక్తులు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో హిందూపురం నుంచి సోమవారం సాయంత్రం బయలు దేరివెళ్లినట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక సర్వీసు ద్వారా అరుణాచలలేశ్వరుడి దర్శన సదుపాయం కల్పించినట్లు చెప్పారు. భక్తుల కోరిక మేరకు మంగళవారం పౌర్ణమి సందర్భంగా అరుణచలేశ్వరుడి దర్శనం, గిరి ప్రదర్శన కోసం రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

వేమన విగ్రహ ఏర్పాటుకు ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న జనార్దన్‌రెడ్డి

మడకశిరరూరల్: మడకశిర పట్టణంలో యోగి వేమన విగ్రహం ఏర్పాటు చేయడానికి దాతలు సహకారం అందిస్తున్నారని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం వైబీహళ్లికి చెందిన జనార్దన్‌రెడ్డి రూ.1.40 లక్షలు చెక్కును అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే వేమన విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర రెడ్డి సంఘం సభ్యులు నాగభూషణ్‌రెడ్డి, స్థానిక సంఘం నాయకులు బాలకృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, మణికంఠరెడ్డి, శ్రీరామరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకాలువలో పూడికతీత పనులు

హిందూపురం: వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని పలు చెరువు సప్లయ్ చానల్, పెద్దకాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభిస్తున్నమని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు చెప్పారు. ఇందులో భాగంగా సూరప్పకట్ట మరువ అనుబంధంగా ధరంపురం వద్ద ఉన్న పెద్దకాలువలో జేసీబీ యంత్రాల ద్వారా పూడిక తీత పనులు చేపట్టామన్నారు. ఏప్రిల్ నాటికి అన్నిచోట్ల పూడికతీత పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు.